మీ-సేవా నిర్వాహకులకు ఈ -కామర్స్‌పై శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మీ-సేవా కేంద్రాల ద్వారా ఈ-కామర్స్ సేవలు నిర్వహించడం వల్ల ఈ-కామర్స్ రంగంలో పెను మార్పులు వస్తాయని మీ-సేవా కమిషనర్ రవికిరణ్ తిరుమల అన్నారు. ఫ్లిప్‌కార్ట్, తెలంగాణ ఐటీశాఖ సంయుక్తాధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో గురువారం మీ-సేవా నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ-సేవా కేంద్రాల ద్వారా ఈ-కామర్స్ సేవల వల్ల స్థానిక ఎంఎస్‌ఎంఈ వ్యాపారులకు లాభం చేకూరుతుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఫ్లిప్‌కార్ట్ సీనియర్ మేనేజర్ దీపు థామస్ జాయ్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్,

చార్మినార్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్మన్ కొత్తకోట సీతదయాకర్‌రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ అన్నారు. గురువారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చార్మినార్ వద్ద నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల రక్షణ కమిషన్ మెంబర్లు కంచెర్ల వందన, మర్రిపల్లి చందన, బి. అపర్ణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, ఉమెన్ సేఫ్టీ వింగ్ కమిషనర్ లావణ్య నాయక్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో బ్లడ్ డెలివరీ సేవలు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ సేవలను లైటస్ పేరుతో నగరంలో గురువారం ప్రారంభించారు. ఏఐ ఆధారిత బ్లడ్ లాజిస్టిక్ ప్లాట్‌ఫామ్‌గా దేశవ్యాప్తంగా విస్తరించే క్రమంలోనే దీన్ని ప్రారంభించామని లైటస్ హెల్త్‌టెక్ సీఈఓ సాయి గుణ రంజన్ పురాణం తెలిపారు. ఇప్పటి వరకు చెన్నైలో 5 వేల మందికి రక్తం సరఫరా చేశామని, దీనికి రెడ్ క్రాస్ సొసైటీ నుంచి అవార్డు వచ్చిందన్నారు. నగరంలో సుమారు 100కు పైగా బ్లడ్ బ్యాంకులు ఉండగా, ఏడాదికి 2,75,000 యూనిట్ల రక్తం అవసరం ఉంది. డిమాండ్‌కు అనుగుణంగా సరైన సమయంలో రక్తం అందించలేకపోతున్నారు. దీన్ని గుర్తించి హైదరాబాద్‌లో బ్లడ్ బ్యాంకులు, ఆస్పత్రులతో కలిసి సేవలను అందించనున్నామని సాయి గుణ రంజన్ పురాణం తెలిపారు.

కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ఎయిర్ చీఫ్ మార్షల్

అల్వాల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (ఏఎఫ్‌ఏ)లో ఈనెల 14న నిర్వహిస్తున్న 215 కోర్స్ కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు ముఖ్యఅతిథిగా భారత వాయుసేనాధిపతి(ఎయిర్ చీఫ్ మార్షల్) అమర్ ప్రీత్‌పాల్‌సింగ్ పాల్గొంటున్నారని రక్షణ శాఖ పౌర సంబంధాల అధికారి శివహరినాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో ఆయన కీలకపాత్ర పోషించారు.

రౌడీషీటర్ హత్యకు పథకం

- మరో ముఠా సభ్యుల అరెస్ట్.. 12 కత్తులు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో హత్యకు పథకం వేసిన రౌడీషీటర్‌తోపాటు గ్యాంగ్ సభ్యులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 12 కొబ్బరి బొండాం కొట్టే కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పహాడీషరీఫ్‌కు చెందిన మహ్మద్ జబ్బార్(43) పాత నేరస్థుడు. గతంలో రౌడీషీటర్ ముర్తుజా అలీ వద్ద పనిచేసేవాడు. జబ్బార్‌పై ట్రై కమిషనరేట్ల పరిధిలో హత్య, హత్యాయత్నం, బెదిరింపులు, స్నాచింగ్ వంటి 12 కేసులు నమోదయ్యాయి. ఇతడిపై పోలీసులు రెండుసార్లు పీడీ యాక్ట్ నమోదు చేయగా జైలుకెళ్లొచ్చాడు. ముర్తుజా వద్ద పనిచేయడం మానేసిన తర్వాత సొంత గ్యాంగ్‌ను తయారు చేసుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ముర్తుజాను చంపేందుకు జబ్బార్ పలు ప్రయత్నాలు చేశాడు. అలీని చంపేందుకు జమీర్ ఖాన్(30), రౌడీషీటర్ సయ్యద్ షాఅబ్దుల్ జబ్బార్ అలియాస్ సులేమాన్(22), మహ్మద్ రహమత్ అలియాస్ సోను(28), సయ్యద్ షా అబ్దుల్ మన్నాన్ అలియాస్ సల్మాన్(31), మహ్మద్ నాసిర్(38)తో గ్యాంగ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. హత్య కోసం 12 కొబ్బరి బొండాలు కొట్టే కత్తులు కొనుగోలు చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. 12 కత్తులు, ఐదు సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు. ముఠాలోని మరో ఇద్దరు మౌసిన్, అజహర్ పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స

- వెన్నెముకలో క్యాన్సర్ కణితి తొలగింపు

హైదరాబాద్ సిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నడవలేని స్థితిలో ఉన్న మహిళకు కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. డాక్టర్ హిమాన్షు ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన మహిళ (55) నడవలేని పరిస్థితిలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రికి వచ్చారు. ఆమెను పరీక్షించిన వైద్యులు వెన్నెముక భాగంలో క్యాన్సర్ కణితి పెరిగి పక్షవాతం స్టేజ్‌లోకి వెళ్లినట్లు గుర్తించారు. క్యాన్సర్ కణితి తొలగించేందుకు 'ఎన్ బ్లాక్ రీసెక్షన్' శస్త్రచికిత్స చేశారు. మొదటి దశలో ఇంటర్‌వెన్షన్ 'ఎంబోలైజేషన్' పద్ధతిలో రోగికి ఇంజెక్షన్ ఇచ్చి, క్యాన్సర్ కణజాలానికి రక్తప్రవాహాన్ని నిలిపివేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన 24 గంటల తర్వాత వెన్నెముకలో ఉన్న క్యాన్సర్ కణితిని తొలగించారు. కణితి తొలగించిన ప్రాంతంలో ఇంప్లాంట్ అమర్చి నరాలపై ఒత్తిడి లేకుండా శస్త్ర చికిత్సను ఆరు గంటల్లో పూర్తి చేశారు. ప్రస్తుతం ఆమె నడవగలిగే స్థితికి చేరుకున్నారని డాక్టర్ హిమాన్షు ప్రసాద్ తెలిపారు.

రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి మృతి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫతేనగర్‌కు చెందిన ఆలియా భర్తతో గొడవపడి బేగంపేట ప్రకాష్‌నగర్‌లో ఉంటున్న పుట్టింటికి వచ్చింది. భర్త వేధింపులు భరించలేకపోతున్నానని తల్లిదండ్రులకు చెప్పగా సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్న ఆమె ఈనెల 7వ తేదీన సంజీవయ్య పార్కు సమీపంలో రైల్వే పట్టాల వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న తండ్రి మహ్మద్ అక్కడకు వెళ్లి కుమార్తెకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్నాడు. ఆ సమయంలో సికింద్రాబాద్ నుంచి వేగంగా వస్తున్న గూడ్స్ రైలు ఢీకొట్టడంతో ఆలియా అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన మహ్మద్‌ను స్థానికులు అంబులెన్స్‌లో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



- సంక్షేమ భవన్ ముట్టడి

గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని సంక్షేమ భవన్‌ను ముట్టడించిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు.



సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



అంధుల పాఠశాలను సందర్శించిన డీఈఓ రోహిణి



ఆర్యసమాజ్ ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి



మన్సూరాబాద్‌లో చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి

మోగిన బడిగంట

ప్రారంభమైన పాఠశాలలు

తొలిరోజే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేత



సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మోహన్‌నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్

వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు బడిబాట పట్టారు. ఆటలకు టాటా చెప్పి పుస్తకాల బ్యాగు చేతపట్టుకుని ఒకింత అయిష్టంగానే పాఠశాల వైపు అడుగులు వేస్తూ మొదటి రోజు పాఠశాలలకు చేరుకున్నారు. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా సమస్యలు విద్యార్థులకు స్వాగతం పలికాయి. చాలా పాఠశాలలో తరగతి గదులు, మూత్రశాలలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. కాగా పాఠశాలకు తొలి రోజు కావడం.. ఉదయాన్నే పలు చోట్ల వర్షం కురియడంతో హాజరు శాతం తగ్గింది. చాలా స్కూళ్లలో యాభై శాతం కూడా హాజరు నమోదు కాలేదని విద్యాధికారులు తెలిపారు. పలు ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులు మామిడితోరణాలతో అలంకరించారు. మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులపై పూలు చల్లుతూ, చాక్లెట్లు ఇచ్చి స్వాగతం పలికారు. దారుల్‌షిఫా ప్రభుత్వ ప్రాథమిక అంధుల బాలుర పాఠశాలను హైదరాబాద్ డీఈవో రోహిణి సందర్శించారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన బడిబాట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విద్యార్థులకు దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, మధుసూధన్‌రెడ్డి, అరుణారవిందర్‌రెడ్డి, మండల ఉపవిద్యాశాఖాధికారి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోన్ బృందం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి)



అమ్మతో కలిసి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



పాఠశాలకు వస్తున్న అక్కాచెల్లెళ్లు



బాగ్ ముసారిమో ప్రాథమిక పాఠశాలలో చాక్లెట్లను పంపిణీ చేసి వెల్‌కమ్ చెబుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం: ఎమ్మెల్యే రంగారెడ్డి

- బాటసింగారంలో ఎరువుల గోదాం ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. రైతులకు ఎలాంటి సమస్య ఉన్న నిమిషాల్లో పరిష్కరిస్తామన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘంలో సుమారు రూ.16 లక్షలతో నూతనంగా నిర్మించిన ఎరువుల గోదాంను సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్, పాలకవర్గం డైరెక్టర్లతో కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల మూలంగానే సంక్షేమ పథకాల అమల్లో జాప్యం జరుగుతుందన్నారు. పదేళ్లల్లో మిగులు బడ్జెట్ రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చారని ఆయన ఆరోపించారు. దక్షిణ తెలంగాణ అభివృద్ధికి గత బీఆర్ఎస్ ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. హయత్‌నగర్ సహకార సంఘం చైర్మన్ కృష్ణారెడ్డి, సంఘం వైస్ చైర్మన్ మల్లమ్మయాదవ్, మేనేజర్ ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.



ఎరువుల గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

నూతన సీవరేజ్ నిర్మాణానికి ప్రతిపాదనలు

చాదర్‌ఘాట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చంచల్‌గూడ జైలు నుంచి మర్వా హోటల్ వరకు నూతన సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల జలమండలి చంచల్‌గూడ సెక్షన్ మేనేజర్ నవీన్‌కు సూచించారు. చావునీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గురువారం పర్యటించారు. మర్వా హోటల్ నుంచి చంచల్‌గూడ జైలు వరకు సీవరేజ్ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండడంతో నూతన పైప్‌లైన్ నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇందుకు రూ.కోటిన్నర వ్యయమవుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్, జలమండలి ఆజంపుర సెక్షన్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ మహేశ్ పాల్గొన్నారు.

ఉమెన్ థీమ్ పార్కు పనుల పరిశీలన

వనస్థలిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్ దగ్గర నిర్మిస్తున్న ఉమెన్ థీమ్ పార్కు పనులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. బీఆర్ఎస్‌కు మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో కాంగ్రెస్ నాయకులు పనులు ఆపివేయించారని, మళ్లీ పనులు ప్రారంభించామని అన్నారు. పార్కు పనులను త్వరితగతిన పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన ఉప్పల

వనస్థలిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడిని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలని ఉప్పలకు మహేశ్‌కుమార్‌గౌడ్ సూచించారు.



మహేశ్‌గౌడ్‌కు జ్ఞాపికను అందజేసి సత్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

అభివృద్ధిలో దూసుకుపోతున్న భారత్: శ్రుతి

వనస్థలిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాలకు దీటుగా భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకపోతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి అన్నారు. మోదీ 11ఏళ్ల పాలనను పురస్కరించుకుని ప్రొఫెషనల్ మీట్ విలేకరుల సమావేశాన్ని గురువారం హయత్‌నగర్‌లోని హుడాసాయినగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని శ్రుతి విమర్శించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి రంగారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్, కార్పొరేటర్లు నవజీవన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

మీర్‌పేట్‌లో రంజిత్‌రెడ్డి అంత్యక్రియలు

సరూర్‌నగర్, చాదర్‌ఘాట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీటీసీ తీగల రంజిత్‌రెడ్డి అంత్యక్రియలు గురువారం ఆయన స్వగ్రామం మీర్‌పేట్‌లో ముగిశాయి. అంత్యక్రియల్లో మహేశ్వరం, ఎల్‌బీనగర్, మలక్‌పేట ఎమ్మెల్యేలు సబితారెడ్డి, సుధీర్‌రెడ్డి, బలాల, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ డా.తీగల అనితారెడ్డి తదితరులు ఆయనకు నివాళులర్పించారు.

కర్మన్‌ఘాట్ ఆలయంలోకి వర్షపు నీరు

చంపాపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ ముఖద్వారం ముందు వర్షపు నీరు నిలిచింది. గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి ఆలయ ప్రాంగణమంతా వరద నీటితో నిండింది. దీంతో ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

డివిజన్ అభివృద్ధికి కృషి చేయండి: లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధికి కృషి చేయాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులను కోరారు. ఈ మేరకు ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంతకేశవ్ పాటిల్, డీసీ తిప్పర్తి యాదయ్యలతో కలిసి కార్పొరేటర్ లచ్చిరెడ్డి బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లో పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రహదారి అభివృద్ధి ఎప్పుడు?

- ఆందోళన చేపట్టిన బీజేపీ నేతలు
- రోడ్డుపై వంటావార్పు
- కమిషనర్ హామీతో ఆందోళన విరమణ

సరూర్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్- బడంగ్‌పేట్ ప్రధాన రహదారి అభివృద్ధి విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు గురువారం ఆందోళనకు దిగారు. బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి రవికాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు నాదర్‌గుల్ రోడ్డుపై బైఠాయించి వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, మునిసిపల్ కమిషనర్ సరస్వతిలకు వ్యతిరేకంగా బీజేపీ నేతలు నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న కమిషనర్ సరస్వతి వెంటనే అధికారులతో కలిసి నాదర్‌గుల్‌కు చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులతో ఆమె చర్చించారు. నేతలు అక్కడి ఇబ్బందులను ఆమెకు వివరించగా.. స్పందించిన కమిషనర్ 15 రోజుల్లోగా రోడ్డు పనులు మొదలు పెట్టిస్తామని వారికి హామీ ఇచ్చారు. దాంతో ఆందోళన విరమించారు. నిరసన కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు ఏనుగు రాంరెడ్డి, మాజీ కార్పొరేటర్లు సునీతాశ్రీకాంత్‌గౌడ్, ఇంద్రసేన, పార్టీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వీరకర్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, భాగ్యనగర్ సహకార సంఘం మాజీ చైర్మన్ పుల్లారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అంజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అరవిందరెడ్డి, నరేశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, యాదిరెడ్డి, లక్ష్మణ్, ప్రవీణ్‌గౌడ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



నాదర్‌గుల్ రోడ్డుపై బీజేపీ నేతల వంటావార్పు

చెరువుల అభివృద్ధికి కృషి: మధుయాష్కిగౌడ్

హయత్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని జంట చెరువుల అభివృద్ధికి కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. హయత్‌నగర్‌లోని కుమ్మరికుంట, బాతులచెరువు, హయత్‌బక్షి మసీదు, పంజగుట్టలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బాలరాజు చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయని, గుర్రపుడెక్క విపరీతంగా పెరిగిందని, రెండు చెరువుల్లో డ్రైనేజీ నీరు కలుస్తుందని మధుయాష్కిగౌడ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన మధుయాష్కిగౌడ్ అధికారులతో మాట్లాడి చూస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు సుజాతారెడ్డి, కాంగ్రెస్ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపురంకాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

చాదర్‌ఘాట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్‌లోని శ్రీపురం కాలనీలో గురువారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పేరుకుపోయిన చెత్త కుప్పలు, మట్టికుప్పలు, ఫుట్‌పాత్‌లపై మొలిచిన గడ్డి, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఏఎంహెచ్‌వో డా.శ్రీనివాస్ రుద్ర పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కాలనీవాసులు జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. ఇంట్లోని చెత్తను రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపై పారవేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వచ్ఛ ట్రాలీ సిబ్బందికి చెత్తను అందజేయాలని ఏఎంహెచ్‌వో కోరారు.

- కావేటి ఇంటికి త్రిపుర గవర్నర్



త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి సైదాబాద్ పూసలబస్తీలోని బీజేపీ సీనియర్ నేత కావేటి జగన్నాథం గురువారం నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా అతడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అరుణారవీందర్‌రెడ్డి, డిప్యూటీ మాజీ మేయర్ సుభాష్ చందర్జీ, నేతలు శ్రీకాంత్‌రెడ్డి, వేణుగౌడ్, ఆశీష్ తదితరులు పాల్గొన్నారు.

- సైదాబాద్, ఆంధ్రజ్యోతి

- ప్రత్యేకాలంకరణలో దుర్గాదేవి

మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయ 20వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చల్లా బాలమురళీ కృష్ణశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ గణేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

- మన్సూరాబాద్, ఆంధ్రజ్యోతి



అపార్ట్‌మెంట్ నివాసిపై బిల్డర్ దాడి

- మలక్‌పేట పీఎస్‌లో ఫిర్యాదు

చాదర్‌ఘాట్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు చేపడుతుంటే ప్రశ్నించిన అపార్ట్‌మెంట్ నివాసిపై బిల్డర్ మసియుద్దీన్, వాచ్‌మెన్ కలీంఖాన్‌తో పాటు అతని అనుచరులు విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనపై బాధితుడు బ్రహ్మానందం మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఆస్మాన్‌ఘడ్‌లోని ఎలైట్ రెసిడెన్సీ గ్రౌండ్ ఫ్లోర్ పార్కింగ్ స్థలంలో బిల్డర్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. దీనిపై అదే అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న బ్రహ్మానందం బిల్డర్‌ను నిలదీశాడు. దీంతో రెచ్చిపోయిన బిల్డర్ మసియుద్దీన్, వాచ్‌మెన్ కలీంఖాన్‌తో పాటు మరో ముగ్గురు అతని అనుచరులు దాడి చేశారని మలక్‌పేట పోలీసులకు ఆయన ఫిర్యాదు చేశాడు. దాడిలో గాయపడిన బాధితుడు బ్రహ్మానందం స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు మలక్‌పేట పోలీసులు తెలిపారు.

బాచారంలో రైతు అవగాహన సదస్సు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామంలో గురువారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త రజనీకాంత్, అరుణ పాల్గొని వ్యవసాయంలో వివిధ అంశాల గురించి రైతులకు వివరించారు. వానకాలం పంటల సాగుపై పలు సలహాలు, సూచనలు చేశారు.